# పిల్లీ శతకం

బోయి భీమన్న

రెండవ ముద్రణ

1974

నాట్యకళ ప్రెస్

భాగ్యనగరు

హక్కులుః రచయితవి

వెల: 5/-

# దైవజ్ఞత్వం

"పిల్లిని చంకను బెట్టుక
వెళ్లుట"యను పిచ్చి నుడులు, విశ్వాసములున్
చెల్లవిక, నిన్ను గైకొని
ఢిల్లీ వర కేగవచ్చు, తెలియవె! పిల్లీ!

అంటూ ఈ పిల్లీ శతకాన్ని (124వ పద్యం) ముగించాను. మీరెవరైనా గమనించారా?

చాల కొద్దిమంది గమనించి వుంటారు. అందుకే – ఢిల్లీ వరకూ వెళ్ళిన చాల కొద్ది మంది మాత్రమే ఉన్నత పదవుల్ని తెచ్చుకోగలిగారు. వాళ్ళంతా ఈ పిల్లీ శతకాన్ని చంకబెట్టుకు వెళ్లిన వాళ్లే అయి వుండాలి. నిజం.

నిజం అని ఎందుకంటున్నా నంటే – నేను కూడ అదే పని చేశాను కనుక! నేను ఎన్నడూ ఆశించని యూనివర్శిటీ గౌరవ డాక్టరేటు "కళా ప్రపూర్ణ"ను, నేను కలలో కూడ ఊహించని "పద్మశ్రీ"ని నేను తెచ్చుకొన్నది ఈ పిల్లీ శతకాన్ని చంకబెట్టుకొని వెళ్లే!

ఇంత ప్రత్యక్ష సాక్ష్యాన్ని కళ్ళార చూచి కూడ – ఈ సాహిత్యపు "పిల్లి" ప్రాముఖ్యాన్ని ఎందుకు గుర్తించరు? గుర్తించిన వాళ్లు ధన్యులు. గుర్తించని వాళ్ళు వట్టి కర్మోపజీవులు. జన్మలో సాహిత్యం కోసం మూడు రూపాయలు కూడ ఖర్చుచెయ్యలేని పచ్చి లోభులు!

తమ ఆదాయం నుంచి నెలకు పది రూపాయలైనా పుస్తకాలు కొనడానికి ఉపయోగించని వాళ్ళు వట్టి మానవరూప మృగాలు. కేవలం కరాళ సృష్టి. (చూడండి – "బమ్మ రిల్లు"లో కరాళ కథలు).

కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలలో అన్నిటినీ గాని, ఏ కొన్నిటినో గాని తీర్చుకోడానికి మాత్రమే జీవితాన్ని వెచ్చించేవాడు మృగం కంటె ఉన్నతుడెలా అవుతాడు? సంగీత సాహిత్యాది లలిత కళలలో అభినివేశం కలిగి – వాటి అనుభవం కోసం తన జీవితంలోని విలువైన కాలాన్నీ, తాను కష్టించి సంపాదించుకొన్న ధనంలోని విలువైన భాగాన్నీ వెచ్చించ గలవాడే నిజమైన మనిషి!

ఏ సాంస్కృతిక ప్రదర్శననైనా సరే, టికెట్టు కొనుక్కొని చూడాలి. ఏ పుస్తకం అయినా సరే, కొనుక్కొని చదవాలి. ఫ్రీ పాసులు నరకానికి ఈడ్చుకుపోయే కుక్కలు.

ప్రభుత్వం ఖర్చుతో – అంటే ప్రజల డబ్బుతో – దేశ విదేశ సాంస్కృతిక ప్రదర్శనలను ఏర్పాటుచేస్తూ, ఆయా రంగాలలో ప్రవేశం కల రసజ్ఞులను ఆ చుట్టు ప్రక్కలకైనా రానీయ కుండా, తామే కుటుంబాలతో సహా ఉచితంగా ముందు సీట్లను ఆక్రమించే అధికారులను, సోషల్ వర్కర్లను, రాజకీయ నాయకులను గురించి నేనేమీ అనడం లేదు. వాళ్ళంతా పురుష సింహులు! ప్రజలే వట్టి గొర్రెలు!

**"పురుషవ్యాఘ్రుం డనుచున్**
**పురుష సింహు డనుచు, పురుష పుంగవు డనుచున్**
**నరుడు మృగము కాదలచును!**
**నరు డందుకె శివుడు కాడు, నమ్ముము, పిల్లీ!"**

అన్న పద్యంలోని భావ మదే. నేడు మన డబ్బు తింటూ, మన నెత్తిపై వామన పాదమో, భస్మాసుర హస్తమో పెడుతున్న మన ప్రతినిధులంతా ఇదే తరహా పురుష సింహులు!

ఇలా వ్రాసుకొంటూపోతే ఈ పిల్లి శతకంలోని ఒకో పద్యానికి ఒకో మహాభాష్యం అవుతుంది. అప్పుడు నేనూ ఒక కవిసింహుణ్ణో, పండిత వ్యాఘ్రుణ్ణో అయిపోగలను. అందుకే ఇక ఈ వ్యాఖ్యానం మానేస్తున్నాను. ఈ మానివేయడం – నా తర్వాత దీన్ని మరెవరో కొనసాగిస్తారని కాదు. నా రచనలు అసలు చదివే వాళ్ళే లేరు. వ్యాఖ్యానాలు ఎవరు చేస్తారు?

నా రచనలు చదివే ప్రజలకు ఇంకా చాలినంత చదువు లేదు. చాలినంత చదువున్న నేటి వాళ్ళలో కొందరికి నేనంటే కిట్టదు. మరి కొందరికి నేనంటే భయం!

అయితే మాత్రం ఏం?

నేను వాల్మీకి వ్యాసుల వారసుణ్ని. వాల్మీకి త్రేతాయుగం వాడు. వ్యాసుడు ద్వాపర యుగం వాడు. నేను కలియుగం వాణ్ని! మళ్ళీ కృతయుగానికి దారి చూపుతున్నాను నేను. చూడగలవాడు శిష్టుడు. చూడలేని వాడు దుష్టుడు! శిష్ట రక్షణ, దుష్ట శిక్షణ – ఇదొక Balance of power!.

"శీలమన పిల్లి శీలమె శీలము..."

శీలాన్ని, అసలు మానవత్వాన్నే పోగొట్టుకొని, కేవలం బ్రతకడానికి చీకటి పెంట కుప్పల్లో తుట్ట పురుగుల కంటె కూడ హీనంగా గిజగిజ తన్నుకొంటున్న నేటి ధనకుక్షులు కనీసం ఈ పిల్లీ శతకాన్నైనా చదివి బాగుపడతారేమో చూడాలి!

మానవుడనే వాడు ఆలోచించాలి. ఆలోచించలేని వాడు చదవాలి. చదవలేని వాణ్ని గురించి "అయ్యో, పాపం!" అంటాం; చదవగలిగివుండి, చదవని వాణ్ని ఏమంటాం? "అతడే పాపానికి అయ్య" అంటాం!

ఈ శతకం రెండో శతకాన్ని (రెండవ వెయ్యి ప్రతుల్ని) మీకందిస్తున్నాను చదవండి. బాగుపడండి! "చదవని వాడజ్ఞుండగు. చదివిన సద సద్వివేక చతురత కల్గున్" అన్నారు మన భాగవతం పోతన్న గారు.

"వినదగు ఎవ్వరు చెప్పిన,
విని – ఆ చెప్పిన యతండు వేరే కులమా
మన కులమా అని చూడక –
మనిషని గుర్తించు వాడె మనుజుడు పిల్లీ"

శకునాలు వట్టి మూఢ నమ్మకాలు కావు. అవి మంచి చెడ్డల ఛాయలు. అందమైన వస్తువులు, ఇంపైన మాటలు మనస్సుకు ఆహ్లాదం ఇస్తాయి. ఏ మనస్సైనా శుభమూ, విజయమూ కోరుకొంటుంది. అశుభ, వికార సన్నివేశాలను పరిహరిస్తుంది. మన

మీద ఒక దొంగవాడి కన్ను పడడానికీ, ధర్మదాత కన్ను పడడానికీ తేడా లేదా? మిత్ర శత్రు శక్తుల, భావాల సంఘర్షణ ఇది. దీనికి కురుక్షేత్రం మనస్సే.

దొంగకు పోలీసు అపశకునం, ధనికుడు శుభశకునం. ఆయా వ్యక్తుల గుణ వృత్తి స్వభావాలను బట్టి అపకారకాలు అపశకునాలు, ఉపకారకాలు శుభశకునాలు! ఇవి నమ్మకాలు కావు. నిత్యసత్యాలు! మినహాయింపు లుంటాయి. శత్రువు కాపాడనూ వచ్చు, మిత్రుడు చంపనూ వచ్చు. అలాంటివి కొద్దిపాటే.

పిల్లి మిత్రువో, శత్రువో, కాని ఈ సాహితీ పిల్లి మాత్రం నిత్య శుభంకర సుహృన్మణి. సర్వమానవ సమతా సుందర జీవితానికి మార్గం చూపుతున్న దైవజ్ఞ.

1974 బోయి భీమన్న

## సుమతీ - పిల్లీ

"బాబూ! నీవు పుట్టుకతో కవివి. పుట్టుకతో కవి అయినవాడు జీవితంలో దేన్నైనా వదులుకొంటాడు కాని, కవిత్వాన్ని వదులుకోడు. అందుకే స్వానుభవం మీద నీకీ సలహా ఇస్తున్నాను. నీ రచనల్ని నీ సొంత డబ్బుతో మాత్రం ప్రకటించకు. నీవు శ్రమపడి ఆర్జించే డబ్బు నీ కుటుంబానిది. దాని ప్రచురణ ఖర్చును ప్రజలే భరించాలి. సరస్వతీ ప్రసాదంగల ధనికులుంటే విరాళాలిస్తారు. లక్ష్మీ ప్రసన్నతకల సహృదయులుంటే కొని చదువుతారు. ఎవ్వరూ లేకపోయినా ఫర్వాలేదు. వ్రాయడం వరకే నీ బాధ్యత."

1936 మే ఒకటవ తేదీని, నా పెండ్లి సందర్భంలో తమ యోగానంద రామాయణాన్ని బహూకరిస్తూ, మధ్వశ్రీ చిల్లరిగె యోగానందయ్యగారు నాకిచ్చిన సలహా ఇది.

రాజోలు హైస్కూలులో, 1929-31 మధ్య, నాలుగవ ఫారం నుంచి స్కూలు ఫైనలు వరకు, యోగానందయ్యగారు మాకు తెలుగు మాష్టారు. యోగానంద రామాయణం వ్రాసిన పండిత కవి, పరమ భక్తుడు ఆయన. ఎవరి క్లాసు ఎగ్గొట్టినా, ఆయన క్లాసు మాత్రం ఏ విద్యార్థీ మానుకొనే వాడు కాడు. శంకరాభరణ రాగంలో పద్యాన్నీ, గద్యాన్నీ కూడా శ్రావ్యంగా చదువుతూ ఆయన పాఠం చెపుతూ ఉంటే - అదొక హరికథలా ఉండేది.

మా నాలుగవ ఫారంలో, బమ్మెర పోతన్నగారి భాగవతంలోని గజేంద్ర మోక్షం పాఠం చెప్పారాయన. అందులోని ప్రతి పద్యం, ప్రతి వచనం కూడ ప్రతి విద్యార్థి చేతా కంఠస్థం చెయ్యించారు. "అది మరియును మాతులుంగ లవంగ లుంగ చూత కేతకీ భల్లాత కామ్రాతక..." అనే మహా వచనం సైతం వదలబడలేదు. ఈనాడు నాకు పట్టుమని పది పద్యాలైనా నోటికి వచ్చునంటే – ఆనాటి యోగానందయ్యగారి కఠోర శిక్షణే కారణం అనవచ్చు.

పాండిత్యానికి పునాది భాష. భాషమీద ఆధిపత్యం కలవాడు ఏ రంగంలోనైనా రాణించ గలడు. భాషకు మూలం ధారణాశక్తి. ధారణా శక్తి పెంపొందాలంటే ప్రామాణ్యంకల పూర్వ గ్రంథాలను చిన్నప్పుడే కంఠస్థం చెయ్యాలి. అట్టి పద్ధతి పూర్వం మన దేశంలో ఉండేది. ఆనాడు పాండిత్యం అత్యున్నత స్థాయిలో ఉండేది. దానిపై ప్రతిభ దిక్కులు పగిలేలా వికసించేది. తద్విరుద్ధమైన నేటి ఆధునిక విద్యా పద్ధతి ఎక్కువ నిరుద్యోగుల్నీ, నిరక్షరకుక్షుల్నీ సృష్టించడానికి తప్ప మరెందుకూ పనికిరావడం లేదు.

కంఠస్థం చేసే పద్ధతి పాండిత్యాన్ని పెంచవచ్చునే కాని, ప్రతిభను పెంచదన్న వాదం ఉంది. అది సరికాదు. మన గురుకుల విద్యాభ్యాస పద్ధతిని కించపరచడానికి పాశ్చాత్యులు లేవదీసిన వాదం అది. వారు ప్రభువులు. కనుక అది శాసనం అయింది. వారి అనుచరులకు ఏడుగడ అయింది. నేటికీ మన విద్యాధినేతల్ని పట్టుకొని పీడిస్తూనే ఉన్నదది. అదే మన దురదృష్టం. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా, మన భావానికి స్వాతంత్ర్యం రాలేదు.

మన విద్యారంగంలో ఈనాడు ఉన్నంత అవ్యవస్థ, అయోమయత, అజ్ఞత మరెప్పుడూ లేదు. ఎడమచెయ్యి తియ్యడం, పురచెయ్యి పెట్టడం – ఇవే నేటి మన విద్యా సంస్కరణలు, ప్రణాళికలు! ఈ ప్రణాళికా బృహద్వారాల క్రింద దిక్కుతోచక గిలగిల కొట్టు కొంటున్న విద్యార్థుల్ని చూచి జాలిపడడానికి బదులు, క్రమశిక్షణ లేదంటూ ఏడ్చి ఏంలాభం? ఉపాధ్యాయులకే అర్థంకాని సిలబస్సులు విద్యార్థులకేం అర్థమవుతై? అర్థంలేని విద్యలో ఏం ఇంటరెస్టు ఉంటుంది? డిగ్రీ లేకపోతే ఉద్యోగం రాదు కనుక, క్లాసుకు వెళతారు. అక్కడ నేర్చుకునేదీ, చేసేదీ ఏం లేదు కనుక, అల్లర్లలో

పాల్గంటారు. అల్లరి చేసి అరిస్తేనే కాని సత్యాన్ని గుర్తించే కాలం కాదయ్యె! బాల్యంలోను, యౌవనంలోను పొంగులు వారే మానవ శక్తులను విద్య ద్వారా, ప్రయోగం ద్వారా ఉపయుక్తమైన మార్గాలలో నడిపించే నాయకత్వం లేదయ్యె. పెద్దలకు కావలసినవి పదవులు, అధికారాలు, అతిశయాలు, వేతనాలు. పిన్నల్ని తీర్చిదిద్దేది ఇక ఎవరు?

ఇన్ని కోట్ల మంది యువజనులు గల దేశం, ఇన్ని విధాల ప్రకృతి సంపదకల దేశం – జన్న పిండి కోసమూ, పాలపొడి కోసమూ ప్రపంచం వీధుల్లో ముష్టెత్తుకొని బ్రతకవలసిన దైన్యానికి ఎందుకు దిగజారిపోయింది? విద్య, సంస్కృతి, వేదాంతం లోనే కాక, ఆర్థిక రంగంలో, సైనిక రంగంలో కూడా ప్రపంచాన్ని ఏలవలసినంత జన బలం, ధన బలం కల దేశం కాదా మనది? వెనుకబడిన దేశం ఎందుకయిందిది? వెనుకబడ్డ తనం ఎందులో?

పాండితి, ప్రతిభ, అభ్యాసం అనే సిద్ధిత్రయం ఒక్క సాహిత్య రంగంలోనే కాదు, ప్రతి రంగంలోనూ జీవిత సాఫల్య సిద్ధికి అవసరమే. ఈ సిద్ధి త్రయాన్ని, ముఖ్యంగా ప్రతిభను అణచివేసే దుర్మార్గం ఈనాడు గ్రామస్థాయి నుంచి, దేశ స్థాయి వరకు రాజమార్గమై వ్యాపించింది! లంచగొండితనం, చాడీకోరుతనం, కాకాతనం – బ్రతక నేర్చినతనంగా చెలామణీ అవుతూ, ఆ మార్గంలో పట్టపగలే దొంగ సరుకుతో ప్రయాణం చేస్తున్నై! బ్రతక నేర్చిన వాడంటే దగాకోరు అనేగా అర్థం ప్రజల్లో? అంటే, దగాకోరు కానివాడు బ్రతకలేకపోతున్నా డన్న మాటేగా?

ఈ దుస్థితి ఏర్పడడానికి కారణం ఒక్కటే – మెరిట్టు అణచివెయ్యబడడం. శక్తి సామర్థ్యాలు అనర్హతలై పోవడం. ప్రతిభను చూచి బెదిరిపోవడం. అర్హులైన యువకులు ఉపేక్షించబడి, అనర్హులైన వృద్ధులు ప్రోత్సహించబడడం. కాకుల్ని కొట్టి గ్రద్దలకు వేసే దుర్నీతి పగటివేషం కట్టి ప్రజాశ్రేయస్సును పీల్చివెయ్యడం!

రాజకీయ రంగం లోనే కాదు, తక్కిన అన్ని రంగాలలోను కూడా నేడు స్వార్థం చేస్తున్న విలయతాండవం ఇది. ఈ ధర్మగ్లానిలో ఎక్కువగా నలిగిపోతున్నవాళ్లు విద్యార్థులు, యువ కులు, ప్రతిభావంతులైన బుద్ధి జీవులు. దానితో మొత్తం దేశమే దెబ్బతినిపోతున్నది. మంది రాజ్యం మంద రాజ్యంగా పరిణమిస్తున్నది!

మన కళలను, మన సాహిత్యాన్ని, మన సంగీతాన్ని, మన ఆధ్యాత్మిక తత్వామృతాన్ని మాత్రమే కాక – మన నదుల్లోని నీటిని, మన చేలల్లోని పంటను, మన ప్రజల్లోని శక్తిని కూడ ప్రపంచానికి పంచిపెట్టగలిగిన మహాజాతి – పొరుగు దేశాలవాళ్లు ప్రయోగించేసి పనికిరావని పారేసిన ఉడికీ ఉడకని "ఇజాల" మెతుకుల కోసం నేడు అర్రులు చాస్తున్నది!

పిల్లీ శతకం పీఠిక చదువుతున్నారు మీరు.

దేశ శ్రేయస్సును కోరే నాయకులంతా నడుంకట్టి, స్వార్థాన్ని అరికట్టి, ప్రతిభను గుర్తించి, దానికి అన్ని రంగాలలోను చలామణీని కలిగిస్తేనే తప్ప దేశపురోగమనం సాధ్యం కాదు. అలా జరిగే వరకూ ఈ దేశం పేద దేశమే – తిండిలో, బట్టలో, తెలివితేటల్లో, పరువు మర్యాదల్లో – అన్నిట్లోను.

ప్రతిభ ఉన్నచోట కుల విచక్షణ లేదు – యోగానందయ్యగారికి. అసలు మన ఆర్ష సంప్రదాయమే అట్టిది. మన మహర్షులంతా వర్ణ వ్యవస్థకు వెలుపల పుట్టినవారే. అవర్ణులైనా, సవర్ణులైనా – అంతా ఆర్యులే. ప్రతిభకూ, కులవర్ణ వర్గ భేదాలకూ సంబంధం లేదు. బ్రహ్మ విద్యా సంపన్నుడు ప్రతివాడూ బ్రాహ్మణుడే ఆనాడు. క్షాత్ర ప్రవృత్తిగల ప్రతివాడూ క్షత్రియుడే. తక్కిన వాళ్లంతా విశ్. అంటే సామాన్య ప్రజ. ప్రతిభకు అంత ప్రాధాన్యం కలదు కాబట్టే వాల్మీకి, వశిష్ఠుడు, వ్యాసుడు మొదలైన వాళ్లు బ్రాహ్మణులు కాగలిగారు. కౌరవ పాండవ వీరులు క్షత్రియులు కాగలిగారు. వైదిక సమాజం ఆనాడు అంత ఉజ్జ్వలంగా వర్ధిల్లగలిగింది!

యోగానందయ్యగారు ఖచ్చితమైన వైదిక సంప్రదాయి కనుకనే – అప్పటికే అమరం, మనుచరిత్ర, కవిజనాశ్రయం, కవిత్రయం వారి భారత భాగాలు, కాలజ్ఞాన తత్వాలు, శుద్ధ నిర్గుణ తత్వకందార్థాలు, ఎర్రాప్రగడ కళాశాస్త్రం వగైరా ఎంతో కొంత చదివి ఉన్న నన్ను అంత ఆదరంతో చూడగలిగారు.

గజేంద్ర మోక్షం కంఠస్థం కావడంవల్ల – పరసహాయం లేకుండానే భాగవతం చదువుకో గలిగాను నేను. అంతకు ముందు చదివిన గ్రంథాలన్నీ ఎక్కువగా టీకా

తాత్పర్యాలు కలిగినట్టివి. స్వయంగా చదువుకోవాలనుకునే ప్రజలకు ఏదో ఒకరకమైన అర్థ వివరణ అవసరం. టీకా తాత్పర్యాలు లేకుండా ప్రాచీన గ్రంథాలను ముద్రించడం నిజంగా వ్యర్థం. పండితులకే అర్థం కావు తిన్నగా మన పూర్వ గ్రంథాలు. వ్యాఖ్యానం లేకుండా, అర్థ సూక్ష్మాల వివరణ లేకుండా, నావంటి విద్యార్థుల కవి ఎలా అర్థం అవుతై? ఏదో ఒక దృక్పథం తెలిసినప్పుడు కదా మన సొంత దృక్పథానికి రాచబాట ఏర్పడటం? అందుకే – ప్రబంధాలకే కాదు, భారత భాగవతాలకు కూడ టీకా వ్యాఖ్యానాలతో కూడిన ముద్రణలు అవసరం అని నేననడం! రామాయణానికి తెలుగు అనువాదాలు కాక, వాల్మీకి సంస్కృత రామాయణానికే తెలుగు టీకా సహిత ముద్రణ కావాలని ఆక్రోశించడం!

''మరియు నా సరోవరలక్ష్మి మద గజేంద్ర వివిధ విహార వ్యాకులిత నూతన లక్ష్మీ విభవయై యనంగ విద్యా నిరూఢ పల్లవ పరికంపిత శరీరాలంకార యగు...'' అన్న వచనాన్ని పాఠం చెపుతూ – యోగానందయ్యగారు వివరించిన అనంగ విద్యా విషయాలు అద్భుత మైనట్టివి. నాలుగవ ఫారంలోని కుర్రవాళ్ల వయసు 12–14 సంవత్సరాల మధ్య ఉంటుంది. వాళ్లకు అనంగ విద్య ఎందుకు? ఆ వచనం వదిలెయ్యవచ్చు. మామూలు టీచరు అయితే అలాగే వదిలేసేవాడు. మరో పండిత ప్రభువుడైతే ఆ వచనాన్నీ, అది ఉన్న భాగవతాన్నీ కూడా నిషేధించాలనేవాడు. కాని, యోగానందయ్యగారు జ్ఞాని. జాతి శ్రేయస్సును కోరినవాడు. బాలుడుగా జీవించిన వాడు. యువకుడుగా బాలుర్ని కన్నవాడు. తన కొడుకులకే కాదు, తన క్లాసు లోని బాలుర కందరికీ తాను పితృతుల్యుడే. తన కొడుకులకు వేద విద్యను ఎంత పవిత్రంగా బోధిస్తాడో, అనంగ విద్యను అంత పవిత్రంగానూ బోధించవలసిన బాధ్యత తనపై కలదని గుర్తించుకొన్న ఋషి. ఆ వచనాన్ని సాకుగా తీసుకొని సెక్సుకు సంబంధించిన అనేక ఆరోగ్యకర విషయాలను కుర్రవాళ్లకు చక్కగా బోధపరిచాడాయన.

పిల్లీ శతకం పీఠిక చదువుతున్నారు మీరు.

అనంగ విద్య అంటే కామ విద్య. అంటే, సెక్సు విద్య. సెక్సును గురించి చిన్న పిల్లలకు చెప్పగూడదనే అజ్ఞానులు ఈనాటికీ ఉన్నారు. చెప్పితే చెడిపోతారని వాళ్ల వాదం. ఇది వట్టి మూర్ఖవాదం. సత్యసమ్మతం కాదు. ఒక వేళ ఎవరైనా చెడిపోయినా – అజ్ఞానంలో మునిగి ఉండడం కంటె, జ్ఞానం ద్వారా చెడిపోవడమే ఉత్తమం కాదా?

యోగానందయ్యగారు అంతటి అభ్యుదయవాది. ఆయన పాఠం తక్కిన విద్యార్థులకు ఎంతవరకు అర్థమయిందో తెలియదు కాని, అప్పటికే నిషేధించబడి ఉన్న ఎఱ్ఱాప్రగడ కళాశాస్త్రాన్ని వ్రాత ప్రతిలో చదివి ఉన్న నాకు, అది ఎంతో చక్కగా బోధ పడినట్టనిపించింది!

శాస్త్రీయంగా బోధించకపోతే, అశాస్త్రీయంగా అలవరచుకోక తప్పని ప్రవృత్తి విద్య - సెక్సు విద్య. దానిని సక్రమంగా తెలుసుకొన్నందువల్ల ఎవరూ, ఏ వయస్సులోనూ, ఏ విధంగానూ పాడుకావడం జరగదు. పైగా, ఎంతో వెలుగు ప్రసరించి, జీవిత మార్గంలో ఎంతో విజయాన్ని సాధించగలుగుతారు కూడ. సెక్సు విజ్ఞానమే జీవిత పథంలో ప్రజ్ఞాన జ్యోతి.

సెక్సు పాపం అనేది వైదిక సంప్రదాయం కాదు. పాశ్చాత్యుల మూఢ భ్రమ అది. వైదిక సంప్రదాయంలో సెక్సు (కామం) ఒక పురుషార్థం.

ప్రకృతి ధర్మాన్ని అనుసరించి, విజ్ఞాన పథంలో బహుముఖంగా వికసించిన సైంటిఫిక్ రెలిజియన్ మనది. అందులో అస్త్ర శాస్త్రానికి ఎంత ప్రాధాన్యం ఉన్నదో, కామ శాస్త్రానికీ అంతే ప్రాధాన్యం ఉన్నది. కామం అవైదిక మనే వాళ్లు వట్టి అప్రాచ్యులు, ఆషాఢభూతులు.

పదహారేళ్ల బాలుడైన ఆదిశంకరుడితో వాత్స్యాయన కామ సూత్రాలలో వాదనకు దిగిన ఉభయ భారతి పుట్టిన పవిత్ర దేశంలో కామశాస్త్ర విజ్ఞానాన్నీ, శృంగార రసాన్నీ నిషేధించాలనడం ఎంత దురదృష్టకర విషయం! నాటి కాలం కింద నేటి కాలం ఎంత క్షీణ శకలం!

తెలుగు విషయంలో ఈ పరిస్థితి మరీ ఘోరం. సాహిత్యంలో బూతు పదాలు వాడడానికీ, సాహిత్యమే బూతుగా ఉండడానికీ తేడా చాల మంది చదువుకొన్న వాళ్లకి తెలియదు. కవి చౌడప్ప శతకం బూతు శతకమా? అతడు వాడిన తెలుగు మాటలకు బదులు సంస్కృత పదాలు వాడితే, అది బ్రహ్మాండమైన నీతి శతకమే కాదా?

చాల మంది చదువుకొన్న వాళ్ల దృష్టిలో బూతు అంటే తెలుగు మాట.

చదువుకోని పల్లెటూరి జనం ఏ శంకా లేకుండా, బాహాటంగా, నిత్యవ్యవహారంలో ఉపయోగించే తెలుగు మాటలు చదువుకొన్న వాళ్లకు బూతులైనై! అట్టి మాటలు ఉపయోగించబడ్డ కావ్యాలు బూతు కావ్యాలైనై. తమ మాతృభాషే ఒక బూతు భాష అయింది. ఆ తెలుగు మాటల్ని సంస్కృతంలోకో, ఇంగ్లీషులోకో మారిస్తే, మళ్లీ అది సభ్య భాషే అవుతుంది! ఇక ఈ జాతి ఎలా బాగుపడుతుంది?

"గోపీ పీన పయోధర మర్దన చంచల కరయుగ శాలీ", "కామపి చుంబతి కామపి రమయతి", "స్మరసమరోచిత విరచిత వేషం" వంటి గీత గోవింద వాక్యాలను కేవలం మన మాతృభాష అయిన తెలుగులోకి అనువదించి చూడండి! ఎలా ఉంటుంది? మన మాతృభాషను ఇంతగా అసహ్యించుకొనే నీచత్వానికి మనం ఎందుకు దిగజారిపోయాం? భారతీయులం అనుకొంటూనే, తెల్లదొరలకు ఎందుకు ఇంకా దాస్యం చేస్తున్నాం?

మానవ సహజ ప్రవృత్తులు శాసనాలకు లంగవు. వాటిని కంట్రోలు చెయ్యాలే గాని, నిషేధించగూడదు. అలాంటప్పుడు భాషలోని మూల శబ్దాలనూ, అవి ఆవిష్కరించే మూల విజ్ఞానాన్నీ కూడ నిషేధించుకోవడం ఎంత అంధత్వం!

పిల్లీ శతకం పీఠిక చదువుతున్నారు మీరు.

ఉపాధ్యాయులే తప్ప, గురువులు లేరు నాకు. అందులోను, ఒక్క యోగానందయ్య గారు తప్ప, నన్ను పట్టి ప్రోత్సహించిన ఉపాధ్యాయులు కూడ లేరు. నిజానికి – గురు శిష్య వ్యవస్థకు స్థానం లేని కాలం అది. ఉపాధ్యాయులు, విద్యార్థులు తప్ప గురువులు, శిష్యులు లేరు నేడు. విద్యాలయాల లోపల కంటె, బైట లభిస్తున్న విద్యా విజ్ఞానాలే ఎక్కువ, యువకులకు ఈనాడు.

నాకు గురువు ఎవరైనా ఉన్నారనుకోవలసి వస్తే – అది మా నాన్నే. అదైనా, వేదాంత దృక్పథంలోనే. నా అభిరుచి, నా ఆరాధన, నా సాహితీ తత్త్వం, నా జీవిత శైలి – సమస్తమూ ప్రకృతి నుంచీ, ప్రజల నుంచీ గ్రహించిందే. పుస్తకాల ద్వారా నేర్చుకున్నది బహు తక్కువ. వేదాంతంలో నాన్న, ప్రేమలో అమ్మ నాకు గురువులు

అనవచ్చు. వాళ్లిద్దరూ ఎందుకో ఒకందుకు ఎప్పుడూ ఘర్షణ పడుతూనే ఉండేవాళ్లు. పురుషునిలోని అహంకారం, ఔద్ధత్యం, పరాక్రమ శీలత, కార్యదక్షత నన్ను ఎంత ఉత్సాహపరిచేవో – స్త్రీలోని అమాయకత్వం, ఆత్మార్పణ, సహనం, సౌశీల్యం అంత ఆనందపరిచేవి. నాన్న రుద్రుడైనప్పుడు, అమ్మ గౌరీదేవిలా సాక్షాత్కరించేది. ప్రకృతి పురుష తత్త్వమూ, అందులోని నిత్య సంఘర్షణా బహుశా నాకు అప్పుడే అనుభవంలోకి వచ్చి ఉండి ఉండవచ్చు.

ఆ తర్వాత కాలక్రమంలో, నూటికి తొంభై మంది భార్యా భర్తలు ఒకళ్ల నొకళ్లు పెట్టుకునే హింసలను గమనించినప్పుడు, ఇందుకేనా మానవులు బ్రతకడం అనిపించి, అసలు వివాహ వ్యవస్థలోనే ఏదో దోషం ఉన్నదనిపించింది నాకు. అసూయ, ద్వేషం, అవిశ్వాసం, ద్రోహం, నిరంకుశత్వం, గయ్యాళితనం, వ్యభిచారం, దుఃఖం వంటి వైషమ్యాలకు అవకాశం లేని వ్యవస్థను రూపొందించడం సాధ్యం కాదా? వృద్ధులైన వాళ్లు తమ బాల్య యౌవనాలను మరికొంచెం స్పష్టంగా జ్ఞాపకం పెట్టుకొని, మానవ మనస్తత్త్వాన్ని మరికొంచెం ఎక్కువగా అర్థం చేసుకొని, యువజనం పట్ల మరికొంత ఉదారంగా ప్రవర్తించగలిగితే – ఎందుకు సాధ్యం కాదు? అభ్యుదయం ఎందుకు సిద్ధించదు?

నేను ప్రెస్‌లో కూర్చుని ఇది వ్రాస్తున్నప్పుడు, ప్రెస్ మేనేజరు గిడుగు రామమూర్తిగారు సవరుల సమాజ వ్యవస్థను గురించి నాకు కొంత వివరించారు. అది చాల ప్రాచీన వ్యవస్థ. వైదిక వ్యవస్థను పోలి ఉంటుందనవచ్చు. దానిని ఆధారంగా తీసుకొని మన ఆధునిక సమాజాన్ని పునర్నిర్మించవచ్చునేమో – మరొకసారి చర్చిస్తాను.

ఏది ఏమైనా సశాస్త్రీయమూ, హేతుబద్ధమూ అయిన సాహిత్యాన్ని, సంస్కృతిని, మతాన్ని, మర్యాదను, మందిని, మార్బలాన్ని పుష్కలంగా కలిగి ఉన్న మనం అన్ని విధాలా వెనుకబడి ఉండడానికి కారణం – మెరిట్టును కాలరాచి, పై మెరుగులకు గొడుగుపట్టడమే. ఈ శతకంలోని ధ్వని అదే.

బిరుదులు, పదవులు, అవినీతి, ఆడంబరాలు, ముసలాబోతు తత్త్వాలు, పచ్చోర్చని తనం, కుళ్లుబోతుతనం, సిరిసంపదలు నెత్తిన గట్టుకుపోతా మన్న మూఢ

భ్రమ – ఇలాంటి తమోగుణ ప్రాభవం మనిషిని నేడు ఆవేశించినంతగా మరేనాడూ ఆవేశించి ఉండలేదు. నేటి విద్యార్థుల కంటె, నాటి మా విద్యార్థులమే అదృష్టవంతుల మేమో! సాహిత్యం కూడ ఈనాడు వలె కూటికోసం కోటి వేషాలకూ, సర్కసు ఫీట్లకూ దిగిన రోజులు కావవి!

ఈ శతకాన్ని వ్రాసి కూడ చాల కాలమే అయింది. కొన్ని సంవత్సరాల క్రితం ఇందు లోని కొన్ని పద్యాలు దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి ఆధ్వర్యంలో ఆకాశవాణిలో కావ్యగానం చెయ్యబడినై. వాణి పత్రికలో ప్రకటించబడినై. భారతిలో కాబోలు ఉన్నత స్థాయిలో ప్రశంసించ బడినై. దాశరథిగారి దాశరథీశతకం ఉపోద్ఘాతంలో ఆచార్య నిడదవోలు వేంకటరావుగారు ఈ పిల్లీ శతకాన్ని ప్రత్యేకంగా మెచ్చుకొన్నారు. అన్యాపదేశం, వ్యంగ్యం, వక్రోక్తి, ధ్వని – వీటిని స్వేచ్ఛగా వాడుకొన్న సెటైరు ఇది.

మానవునితో కలిసి మెలిసి ఉంటూ, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కూడ సంపూర్ణంగాకల జంతువు పిల్లి ఒక్కటే. పిల్లిని గురించి ఉన్నన్ని సామెతలు, చమత్కారాలు, నానుడులు, విశ్వాసాలు మరే జంతువు గురించీ లేవు. అందుకే పిల్లిని ఈ శతకానికి మకుట నాయికగా తీసుకున్నాను. ఇంతవరకు ప్రకటించబడ్డ నా గ్రంథాల కంటె, ఈ శతకం విలక్షణమైనట్టిది. సహృదయులు గుర్తించగలరు.

నేను ప్రతిదినం ఏదో వ్రాస్తూనే ఉంటాను. వ్రాసింది ప్రకటించబడడానికి మాత్రం సంవత్సరాల కొలదీ ఆలస్యమవుతుంది. అందుకు కారణం డబ్బు లేకపోవడమే. దేశంలో ధనానికి కాని, సాహితీ పోషకులకు కాని లోపమేమీ లేదు. ఉన్న లోపమంతా నాదే. ముందుకు చొచ్చుకుపోయే స్వభావం కాదు నాది. అర్థించే గుణం లేదు నాకు. అయినా – నా నైజాన్ని అర్థం చేసుకొన్న మిత్రులు అడక్కుండానే తమకు తాముగానే చేసిన, చేయించిన ఆర్థిక సహాయంతో నేను నా కావ్యాలను కొంతవరకు ముద్రించడం జరిగింది. ఎంతో మంది ప్రముఖ సాహితీ సహృదయులకు ఎన్నో కావ్యాలు అంకితాలు కూడా ఇచ్చాను.

అంకితాలు ఎంతమందికైనా, ఎలాంటి వారికైనా ఇవ్వవచ్చు. మైత్రి, ప్రేమ, గౌరవం, భక్తి – వీటిలో ఏది ఉన్నా చాలు. ఈ విషయంలో పోతన్నగారి ''బాలరసాల

సాల నవ పల్లవ కోమల కావ్య కన్యకన్'' అనే పద్యంతో నేను ఏకీభవించను. నా కావ్యాంకితాలు ప్రేమ ప్రధానమైనవే కాని, ధన ప్రధానమైనవి కావు. నాకు గౌరవాస్పదులైన ప్రముఖులకు, మిత్రులకు నేను అంకితం ఇచ్చిన చాల కావ్యాలు నా సొంత డబ్బుతో ముద్రించుకొన్నవే. ప్రతిఫలాపేక్ష లేనట్టివే. అందుకే, పోతన్నగారి పద్యం ఈ కాలానికి చెల్లదనడం. ఈనాడు ప్రతి ఓటరూ ఒక మహారాజే. అతడు మెచ్చి ఒక పుస్తకం కొనడమే రచయితకు రాజసన్మానం. అతడు పుస్తకం కొనాలంటే, పుస్తకాలు మార్కెట్లో ఉండాలి. అంటే, అచ్చుకావాలి. అందుకు డబ్బు కావాలి. ఉద్గ్రంథాల ముద్రణకు ఉదారులైన మిత్రుల సహాయం లభించేలోగా, ఇలాంటి చిన్న చిన్న కావ్యాలకు సొంత డబ్బు పెట్టుకోక తప్పదు. అందుకే యోగానందయ్యగారి సలహా పాటించలేక పోయాను ఈ విషయంలో.

ఈనాడు రాజకీయ రంగంలో కంటె సాహిత్య రంగంలో ముఠాతత్వం ఎక్కువ. నేను ఏ ముఠాకూ, ఏ ఇజానికీ చెందిన వాణ్ని కాను. వ్యావహారికంగా ఈ మనస్థితి నష్టదాయకమే. సహాయ సన్మానాలన్నీ ఏ ముఠాకు ఆ ముఠాకే పరిమితమై ఉంటాయి. అయితే, నేనొక్కణ్నీ ఒక ప్రత్యేక వ్యవస్థగా రూపొందడానికి ఈ నా ఒంటెత్తు మనస్థితి నాకు తోడ్పడింది. తోచింది వ్రాస్తూ, డబ్బున్నప్పుడు ప్రకటిస్తూ, సాగిపోతున్నాను. ముఠా తత్వాలకు, అసూయాద్వేషాలకు అతీతులై – భారతీయ జీవిత వైశిష్ట్యాన్ని దేశ దేశాలకు మోసుకుపోవాలను కొంటున్న ప్రజలకు, ప్రతిభను గుర్తించడానికి ఏ విధమైన వర్గ సంకుచితత్వమూ అడ్డురాని సహృదయ పాఠక మిత్రులకు నా నిరంతర సేవాభివందనాలు అర్పించుకొంటున్నాను.

నిష్పక్షపాత దృష్టితో, రచయితల పేర్లు కనపడకుండా ఉండే నిమిత్తం అట్టలు చింపేసి, గ్రంథాలను పరిశీలిస్తే – లక్ష రూపాయల ప్రైజు ఏం కర్మ, నోబెలు ప్రైజునే కొట్టుకు రాగల సృజనాత్మక సాహిత్యం తెలుగులో ఉంది. కుర్రవాళ్ళను ప్రోత్సహించ డానికి ప్రత్యేకించబడ్డ నిధుల్ని ముసలివాళ్ళ పెన్షన్ల కోసం ఖర్చుపెట్టే పాపానికి పాల్పడ వలసిన అవసరం లేదు. ముసలి వాళ్ళు గొప్పవాళ్లే. వాళ్ళు చేసిన సేవకు తలో లక్ష

రూపాయలు ఇచ్చి సన్మానించవచ్చు. కుర్రవాళ్ళకు పరుగు పందెం పెట్టి, వెనక కుర్చీలో జేరగిలబడ్డ తాతయ్యకు ప్రైజు ఇవ్వడం కంటె దౌర్భాగ్యం మరేముంది? తెలుక్కి ప్రపంచ ఖ్యాతి రావాలంటే, తెలివికల యువకులు తీక్షణంగా ఆలోచించాలి. రాగద్వేషాలను అధిగమించి పురోగమించాలి.

''సుమతీ శతకం వ్రాసిన కవి పేరు కూడ భీమన్నే! ఆనాడు సుమతులు ఎక్కువగా ఉండేవాళ్ళు. మళ్ళీ ఏడు వందల సంవత్సరాల తర్వాత, నేడు పిల్లీ శతకం వ్రాసిన మీ పేరు కూడ భీమన్నే! ఈనాడు పిల్లులు ఎక్కువగా ఉండడమే అందుకు కారణమా?'' అన్నాడొక పండిత మిత్రుడు. నాటి భీమన్నే నేటి నేనేమో! నాటి సుమతే కౌటిల్యం బలిసి నేటి పిల్లి అవడం జరిగిందేమో! ఎందుకు కాకూడదు?

సంగీత నాటక అకాడమీ తరఫున ప్రెస్సు పెట్టి, రచయితలకు గ్రంథ ముద్రణలో ఎన్నో విధాలుగా తోడ్పడుతున్న ఏత దకాడమీ అధ్యక్షులు పసల సూర్యచంద్రరావుగారు నిజంగా ఎంతో అభినందనీయులు. ఈ ప్రెస్సు అన్నివిధాలా అభివృద్ధి పొంది, రచయితల గ్రంథ ముద్రణ సమస్యలన్నిటినీ తీర్చగలదని నా ఆకాంక్ష.

ఈ శతకానికి ముఖచిత్రం వ్రాసుకొన్నది కూడా నేనే. ఇంతపని నాచేత చేయించిన పిల్లికి, దానిని ఎదదాల్చిన జాబిల్లికి, అతణ్ని తలదాల్చిన ఉమాధవుడికి సర్వతా కృతజ్ఞుణ్ని.

ఇంతవరకు పిల్లీ శతకం పీఠిక చదివారు మీరు.

రసాలిని,<br>అశోక్‌నగర్,<br>భాగ్యనగర్

బోయి భీమన్న<br>మే 1, 1967

1

శ్రీకారములో నీ తి
ప్రాకారము కలిగియుండుటన్ జగమెల్లన్
శ్రీకారము నర్పించును;
శ్రీకారము నేను గొల్తు సిద్ధము; పిల్లీ!

2

నవ కవితా శ్రీధవునకు,
నవ భావ రసోద యార్ధనారీశునకున్,
నవ చేతో వాగ్బ్రహ్మకు,
నవనీతము పెట్టు నీకు నతులే; పిల్లీ!

3

స్తుతమతియై ఈ పిల్లీ
శతకము చదివినను, వినిన, చంకనుగొన్నన్
గతి దోషమెల్ల తొలగును;
శత విధముల మేలు కల్గు సత్యము; పిల్లీ!

4

పిల్లికి, జాబిలి లోపలి
పిల్లికి, పాల్వెల్లి నడరు పిల్లికి, పునుగుం
బిల్లికి, బావురు పిల్లికి,
మల్లెలతో పూజచేతు మరిమరి; పిల్లీ!

5

పిల్లికి ఎదలో చుక్కల
ఇల్లాంద్రకు కూడ లేని యెడమిడి కద జా
బిల్లి అయినాడు చంద్రుడు!
ఉల్లము కద లోకహితము ఉర్విన్! పిల్లీ!

6

మనసు కలవార లనుకొని,
మనుజులకున్ చెప్పి చెప్పి మహెంద్రో కవుల్
మనసు చెడి చచ్చిపోయిరి!
మన సున్నది నీకు, తెలిసి మనవే! పిల్లీ!

7

కూర్చుండుము దగ్గరగా,
తేర్చాడకు శివుని కొడుకు తేజీ వంకన్,
నేర్చినది చెప్పుచుంటిని,
ఆర్చిలను మరచి వినగ దమ్మా! పిల్లీ!

**8**

అల్లన తక్కుచు, తారుచు,
మెల్లన మ్యా వనుచు నను సమీపించుటకున్
చెల్లునె యెవ్వరికిని? నా
ఇల్లాలికి నీకు తప్ప ఇలలో? పిల్లీ!

**9**

పని లేని మంగలికి బల్
పని చెప్పిన మేటి వీవు; పని లేకున్నన్
మనుగడయే లేదు జగతికి!
పని దొంగకు లేదు ఇహము పరమును; పిల్లీ!

**10**

నను గమ్మతు చేయగ మ్యా
వనుచున్ మా పాప రాగ, అట తన కంచ
మ్మును సొమ్ము చేసుకొను నీ
ఘనతన్ కనగలరె యెంత ఘనులున్? పిల్లీ!

**11**

పసి మనసు నీది, లోకపు
పసివారికి నీకు దోస్తి, పసితనమే తా
పసితనము; మానవాళుల
పసిమికి, మిసిమికిని నీవె ప్రాణము; పిల్లీ!

12

"ఓ యమ్మ నీ కుమారుడు
మా యిండ్లను పాలు పెరుగు మననీ" డనుచున్
ఏ యమ్మ నిను స్మరించదు?
నీ యున్నదె గోకులమ్ము నిజముగ; పిల్లీ!

13

మన బాల కృష్ణునకు రే
లును పవళులు లేవు; వెన్నలును జున్నులు నే
మనుగడ; నీకును నటులే;
నిను తెలియుట బాలకృష్ణు నెరుగుట! పిల్లీ!

14

ఇల లోన క్షీరమును, జా
బిలి లోన సుధారసమ్ము బిందెల కొలదీ
కల నిన్ను ఆది భిక్షువు
తల దాల్చక యేమి చేయు తలపగ? పిల్లీ!

15

ముద్దుగ, వెన్నెల ముద్దగ
మిద్దె పయిన్ జేరి నీవు మిలమిల లాడన్
గుద్దుకొని యేడ్చు కుక్కలు!
హద్దులు మీరిన అసూయ లమ్మా! పిల్లీ!

16

"మియ్యాఁ! ఆవ్వూఁ?" అనుచున్
ఒయ్యారము లలుక ప్రక్కనొదిగెడు నీపై
కయ్యానికి కాల్దువ్వెడి
భయ్యాలకు మెడకు గొలుసె బహుమతి! పిల్లీ!

17

ఏడ్చెదరు గాక భువిజులు,
ఏడ్చెదరే గాక దివిజు, లేవ రేడ్చియునున్
ఊడ్చంగ లే రదృష్టము;
పూడ్చంగ లేరు పాలపుంతలు; పిల్లీ!

18

శతకముల కొలది నీతులు
శత విధముల కలవు, వాని జను లెరుగుదురున్;
మెతుకులు ముఖ్యము జీవికి;
బ్రతుకుటయే ముఖ్య నీతి పథమౌ! పిల్లీ!

19

నీతులతో, బూతులతో
భూతలమును మార్చలేవు; పుష్టిగ భూత
ప్రీతి యొనర్చుటె మార్గము;
మేతకు మించినది లేదు మేదిని; పిల్లీ!

20

అంద మన నేమి! హృదయ
స్పందనమే అందమౌను; స్పందనె కవితా
నందనము, కాన నీ కది
కందముతో నిత్తు, ప్రీతి గైకొను! పిల్లీ!

21

ఎడ నెడ కవితలలో నిను
దడమని కవిలేడు; కోరి తనకోసము నీ
కడుపున్ మాడ్చిన లింగడు
పుడమిన్ దుష్కీర్తి నొంది పోవడె? పిల్లీ!

22

సారముగ "పిల్లి పట్టిన
యీరు" వనుచు వ్రాసిపెట్టి, ఎంతయు నీకా
తారార్క్యమైన కీరితి
గూరిచె తిక్కన్న; తెలిసికొంటివె? పిల్లీ!

23

నీ చూపు లేక, చీకటి
లో చూపే లేదు; లేదు లోచూపు నిలన్;
లోచూపు లేక జీవుడు
పై చూపులు చూచి యేమి ఫలమగు? పిల్లీ!

24

లయ బద్ధ మైనదే ఆ
లయ బద్ధము నౌను; రాగ లయ బద్ధ రసో
దయ చైతన్యమె లోకము;
ప్రియ కవితే ప్రాణ నవత పృథ్విని; పిల్లీ!

25

మానవుని నిత్య విధిలో
ప్రాణమ్ములు డస్సియున్న పట్టున కావ్యం
బానంద మొసగు మోహిని
కానేరనిచో, మరెందు కమ్మా? పిల్లీ!

26

ప్రజ లెవ్వరు? వారికి భా
వజ సుఖములు వలదె? వలదె ప్రణయోదయముల్?
అజరామర రస కవితా
సృజనమ్మే లోకహితము సిద్ధము, పిల్లీ!

27

శ్రమ గాథలు వివరింపగ,
మెమొరాండము లంపుకొనగ, మేటగు తీర్మా
నములను చేయగ, కవితా
సుమ మేలను? లేపె ముండ్లు చూడగ? పిల్లీ!

## 28

కలువ అది కలువయే, కొడ
వలి పని నది ఎట్లు చేయు? వరి పొలములబొ
గ్గులు పండునె? ఔచిత్యపు
కళ లెరుగరు నేటి ఘనులు! కనవే, పిల్లీ!

## 29

రెచ్చం గొట్టదు, సూదుల
గుచ్చం గాబోదు, బ్రతుకు గుంజదు, మరియే
గచ్చుపొద కాదు సాహితి;
మెచ్చని చెలి కౌగిలింత; వినవే, పిల్లీ!

## 30

ప్రాచుర్యము కోసరమై
ప్రాచీనపు గ్రంథములకు పండితు డేవో
మాచికలు వేసి తన పను!
వాచకములు లేవె బ్రతుకవసుధన్? పిల్లీ!

## 31

మూతలను ద్రోసి, అన్నిట
మూతిన్ బెట్టుచును, రుచుల మూలము తెలిపే
జాతి కద నీది! నీవే
మాతవొ మా కవులకెల్ల మహిలో! పిల్లీ!

32

కవి భుజగుడు, కవి వృషభుడు,
కవి పికు డని పిలువబడక కవి కాలేడా?
కవితకు కా దా బిరుదులు,
కవి బ్రతుకుకు తోక లమ్మ కలిలో! పిల్లీ!

33

వారిని వీరును, వీరిని
వారును బహు గొప్పచేసి పై కెత్తుచు, తత్
బేరమును పంచుకొందురు;
కీరితి గడియించువారి కిటు కిది, పిల్లీ!

34

వేదార్థ మొకటి – యాజ్ఞిక
వేది, సభావేది, స్వగృహవేదిన్ ఎన్నో
మాదిరుల భ్రష్టమైనది!
ఏదైనను స్వార్థ జుష్టమేనే! పిల్లీ!

35

శివు డే వర మిచ్చిన, కే
శవునకు దనుజుల వధించు సందొక టేదో
మివులు నట! నీవు దానిని
వివరింతువు వంటగదుల వేటన్! పిల్లీ!

36

తలుపులను మూసి, ఏ గతి
వెలుతులు లేకుండ చూచి వెళ్ళగనే – వం
టిలు జత్తు వౌర! కృష్ణుని
చెలివో ఏ జన్మనైన? చెప్పవె! పిల్లీ!

37

ఇంటికి సతియును, చుక్కల
మింటకి చంద్రుడును గొప్ప; మేదిని కెల్లన్
వంటిల్లు గొప్ప; దానికి
బంటువు నీ గొప్ప నెన్న వశమా? పిల్లీ!

38

గొట గొట మని పాలల్కును,
చిట పట భాండములు దొర్లి చిందులు త్రొక్కన్,
పుటుకున తెగిపడు నుట్టెలు!
ఎటు జూచిన నెవరు నుండ రేమే? పిల్లీ!

39

బడ బడ మను చప్పుడు విని,
బడితెను గొని, వంటయింట పాదం బిడ – అ
క్కడ కర్మయు క్రియయునె క
న్పడు! కర్త హుళక్కి యౌను! భళిరే, పిల్లీ!

**40**

కర్మయు క్రియయునె చాలును
ధర్మము కొనసాగ, కర్త దర్శనమేలా
చర్మాక్షుల కను వైదిక
మర్మము మా కిడెడు నీదె మహిమము! పిల్లీ!

**41**

ఇలయే ఒక కర్మ, క్రియా
కలనయు కన్పించు; కాని – కర్తయె యెందున్
కలుగని గతి దాగును కద!
ఇలవేల్పును నీకు శిష్యుడేనా? పిల్లీ!

**42**

కడ వంత బజ్జ దేవుడు
కడు వెరచును, నిన్ను చూచి కాదే? కా, దా
జడుసుకొని తనను బోర్లా
పడద్రోసెడి ఎలుక జూచి! భళిరే! పిల్లీ!

**43**

పంజాను విప్పి నడవవు,
సంజాయిషి చెప్పుకోవు చంద్రునికైనన్,
గుంజాటన పడ వెందును,
సంజయుడే నీకు గురువు! సత్యము, పిల్లీ!

44

పని చేయుము కలుగులలో,
పని చేయుము గాదె క్రింద, పంట పొలాలన్;
పని చేతగాక, ఇతరుల
నని యేమి ఫలమ్ము? తెలియు మమ్మా! పిల్లీ!

45

ఎలుకలను కూడగట్టుము,
పలుకుము చిరువడ్ల వంటి పలుకులు; నీకున్
కలుగదు తిండికి లోపము!
కలిగినదే పెదవి, పదవి కదటే? పిల్లీ!

46

జబ్బ గలవాడె జనపతి,
కొబ్బరి వేసినదె కూర, గుప్పిటి నిండా
డబ్బు గలవాడె మనుజుడు,
దిబ్బడ వేసినదె ముక్కు, తెలియవె! పిల్లీ!

47

ఒద్దిక నుండుట, వేసిన
ముద్దను మాత్రమ్మె తినుట, మురియుట – ఇవియే
పెద్దల దయ సాధించెడి
విద్దెలు! ఇవి వద్దు నీకు, వినవే! పిల్లీ!

48

భయపెట్టెడి కుక్కలకే
భయపడుదురు, దేవుడేని భయపడరు సుమీ
నయశాలియైన; కావున
భయపెట్టుము, పెత్తనములు పడయుము; పిల్లీ!

49

ఎలుక పయి పిల్లి, పిల్లిపై
ఎలుకను ఎక్కించు చెపుడు ఈ మనుజులు మీ
కులవైర మార నివ్వరు!
కల హాకను లమ్మ నరులు! కనవే, పిల్లీ!

50

హృదయములో విష మున్నను
వదనములో తేనె కార్చ వమ్మా! ప్రజల
భ్యుదయపరురాలి వని నీ
పదములు సేవింత్రు, బాగుపడుదువు! పిల్లీ!

51

నూటికి తొంబై మందికి
కూటికి గుడ్డకును లేదు; కూర్చుంటావే
నోటికి తాళము వేసుక?
చాటింపుము వంటగదుల సవరణ! పిల్లీ!

52

పరమాత్మ రూప మన్నము,
పరికింపగ లేదు కొదువ; పదవుల కొఱకై
తర తమములు సృష్టించుక
నరు డొక్కడె పేదయయ్యె! నమ్మము, పిల్లీ!

53

దానము, ధర్మము కుక్కకె;
మానము గల నీకు కాదు; మర్యాదగ నీ
ప్రాణములు నిల్పుకొందువు!
మానముగల వారి కెల్ల మాన్యవు! పిల్లీ!

54

తను చేయుచున్న పనినే
తన వైరి యొనర్చె నేని తప్పని తెగడున్
మనుజుండు; నిన్ను తరిమిన
శునకము ఎలుకకై ఇల్లు చొరదే? పిల్లీ!

55

తన పదవుల కోసము తన
అనుచరులను త్రొక్కియుంచి, అజ గళ దీర్ఘ
స్తనములు చూపుచు పోయెడి
మనుజుడె పో నీతిశాలి! మహిలో, పిల్లీ!

**56**

ఒక డున్న ఒండు చేయు, మ
రొక డున్న మరొండుచేయు; ఒండు మరొండున్
ఒకటే, కొట్టుక తినడము!
ఒకడికి మరియొకడి కదియె యుద్ధము! పిల్లీ!

**57**

ఊరెల్ల నిదుర పోవగ,
ఘోరాహవమునకు పూని, కోటలు పేటల్
హోరెత్తజేయు మీ మా
ర్జాలములకు ఎవరు సాటి జగతిన్? పిల్లీ!

**58**

హితులకు ద్రోహము చేతురు,
పితరులనే మోసగింత్రు, పేడయు తింద్రున్
చితుకైన కలిసి వచ్చిన!
బ్రతు కొక్కటె లోకనీతి! భద్రమె, పిల్లీ!

**59**

అర్థముగు పశులు, పక్షులు
అర్థమ్మగు జలచరాలు, అణు జీవములున్;
అర్థమ్ము కారు మనుజులు!
అర్థమునకు దాసులైన వ్యర్థులు; పిల్లీ!

60

ఒప్పైన జీడి గింజల
నిప్పులలో నుండి తీయు నీదు కరమ్ముౕ
చొప్పించు కోతు లున్నవి!
ఎప్పుడు నేమరక మెలగు మిలపై, పిల్లీ!

61

తిట్టుదురు ఎదురు వచ్చిన,
కొట్టుదు రపశకున మంచు, గొంకక నీకే
పెట్టుదురు పిల్లి శాపము!
మట్టి కదా నరుల మెదడు మహిలో! పిల్లీ!

62

స్వాతంత్ర్య సమావేశము
కై తరలెడు నపుడు నీవు కాదే యెదురై
జాతి పితకు జయ మొసగితి?
స్వాతంత్ర్యము మాకు నీ ప్రసాదమె, పిల్లీ!

63

గౌతముడు బుద్ధుడగుటకు,
భూతదయా మతము లోకమున పుట్టుటకున్,
హేతువు నీవే - ఎలుకను
ఖాతరు లేకుండ తినుట కాదే? పిల్లీ!

64

మాంసము మాషమవదె? మీ
మాంసములో కూడ మంచి మాంసము లేదే?
భోంసేయుము మాంసమునే!
మాంసమె పో జగతి కెల్ల మనుగడ, పిల్లీ!

65

దొంగ వలె దూకి ఎలుకను
భంగించెడి పనికి లజ్జ పడనేలా? నీ
ముంగిటనె తోడి నరులనె
దొంగబజా ర్లందు తింద్రు దొరలే! పిల్లీ!

66

సిలువ పయి చంపి రేసుని,
బలి గొని రల సోక్రటీసు భయద విషానన్,
నిలువున కూల్చిరి గాంధిని!
ఎలుకను దిను టొకటె హింస యెట్లగు? పిల్లీ!

67

తన వారినె మోసముతో
తినివేసెడి మనిషి కన్న, దేవుడు నీ కి
చ్చిన దానికి పరిమితపై
మనుగడ సాగించు నీవె మాన్యవు; పిల్లీ!

68

పుట్టుదురు గాక బుద్ధులు,
గిట్టుదురే గాక ఏసుక్రీస్తులు, గాంధీల్
కట్టుదురు గాక నడుములు,
పిట్టల దిను టెవడు మాను? పృథ్వీన్, పిల్లీ!

69

కరపితివి పులికి విద్యలు,
కరపవు చెట్టెక్కు టకటి గడుసుగ! నీ అ
బ్బురమైన రాజనీతికి
కరములు మోడ్చును జగాలు, కనవే! పిల్లీ!

70

చెలి యైన, చుట్ట మైనన్,
తెలుపగరా దాత్మబలము; తెలిపినచో, నీ
పులి యల్లుని వలె పైబడు!
తలపెట్టును హత్య కూడ! తథ్యము, పిల్లీ!

71

పురుష వ్యాఘ్రమ్ముల కొక
బిరుదై, ఛందమున ముఖ్య వృత్తంబై, శ్రీ
కర మగు శార్దూలమునకు
వర గురువువు! నిన్ను పొగడ వశమా? పిల్లీ!

72

పురుషవ్యాఘ్రుం డనుచున్,
పురుషసింహు డనుచు, పురుషపుంగవు డనుచున్
నరుడు మృగము కాదలచును!
నరు డందుకె శివుడు కాడు, నమ్ముము! పిల్లీ!

73

ఇలలోన పిల్లి జంపుట
తుల తూగును బ్రహ్మహత్యతో నను మాటే
తెలుపును నీ యౌన్నత్యము!
చెలగాటము లాడు మింక స్వేచ్ఛగ! పిల్లీ!

74

ఎలుకల ప్రాణమ్ములకున్,
చిలుకల మానమ్ములకును క్షితిలో నెందున్
విలు వేమిటి? పిల్లయినను
పులిపిల్లై బ్రతుకవలయు పుడమిన్! పిల్లీ!

75

గోడ పయి పిల్లి వాటము
చూడంగా పూర్వజన్మ సుకృతమె! మాకున్
గోడలు దూకుట వరకే
నీ డాబులు, పైన లేవు; నిజముగ! పిల్లీ!

76

కను మూసి పాలు త్రావుచు
కన రెవ రను నిబ్బరమ్ము కలుగుట, ఒక కృ
ష్ణునికిని నీకునె చెల్లును!
అనుచరులై నరులు చత్తు రమ్మా! పిల్లీ!

77

పిల్లికి ఎలుకను పట్టుట
మల్లులు నేర్పంగవలెనె? మధుపాన మిలన్
భల్లూక మెచట నేర్చెను?
ఎల్లయును స్వభావ సిద్ధమేనే! పిల్లీ!

78

పిల్లికి బిచ్చము పెట్టని
పుల్లాయలె సుమ్ము ఘనులు భువి, నె ట్లనినన్
ఇల్లాండ్రకు సుఖ మది! మన
అల్లాకును గౌరవమ్ము! అరయవె! పిల్లీ!

79

తను సృష్టించిన జీవుడు
తన యెదుటే భిక్ష మెత్తు దౌర్భాగ్యము నే
జనకుడు చూచి సహించును?
దనుజు డటే సృష్టికర్త? తలపవె; పిల్లీ!

**80**

ఆయుస్సు నీకు పదునా
ల్గే యేండ్లని యంద్రు! లక్ష యేం డ్లేలినను‌న్
వాయసము పొట్ట కొరకే!
కోయిల క్షణమైన జగము కొరకే! పిల్లీ!

**81**

ప్రాణములు తొమ్మి దుండియు,
మానితముగ పులికి మేన మామవె యయ్యు‌న్,
మానవుని నీడ బ్రతికెడి
హీనత తలవ్రాత గాక యేమే? పిల్లీ!

**82**

రసములు తొమ్మిది, నీకు‌న్
అసువులు తొమ్మిది, ఇదేదొ అద్భుత మగునా?
పస గలుగు నెల్ల జీవులు
రస కలశులె; కలశి కీవ రాణివె! పిల్లీ!

**83**

పొరుగిండ్ల పాలు లేవా?
అరయంగా సొంత యావు అవసర మేమీ?
దొర బిడ్డ వీవి నీ యది!
దొరికిన కడ పిండుకొమ్ము దొరవై! పిల్లీ!

**84**

అక్కర మాలిన దైనన్,
ఎక్కడ దాచినది యైన, ఏ కస పైనన్,
ఒక్క పరి మూతి బెట్టక
చక్కంబడి యుండలేవు! జ్ఞానివి! పిల్లీ!

**85**

పిల్లలను పెట్టి, మరి ఏ
డిళ్ళను చూపెట్టి కాని విడువవు వానిన్!
తల్లి యన నీవె పో! ప్రతి
జెల్లయు నెటు తల్లి యౌను? చెప్పవె! పిల్లీ!

**86**

శీల మన పిల్లి శీలమె
శీలము, అదె సహజ సిద్ధ జీవిత మెపుడున్;
శీల మన సెక్సె అనుకొని
కూలిరి పెక్కండ్రు ఘనులు కుందున, పిల్లీ!

**87**

పొయి మీది పాల కుండను
పొయిలోనే బోర్లదోసి పోదువు, కించి
త్తయినన్ అలికిడి తగిలిన!
భయమా? నిష్కామయోగ పథ మది! పిల్లీ!

**88**

పాయిలోని పిల్లి లేవదు!
వయ సుడిగిన ధాత్రి కింక వారసు లెవరో!
నయ శాలి కాడు మనుజుడు;
పయి కనుకొని క్రింద పడిన పతితుడు! పిల్లీ!

**89**

ఏ న్యాయమ్మైన మార్జా
ల న్యాయము మించ, దమృత లక్ష్మీ పదవిన్
సన్యాసులైన నీ పద
విన్యాసము లేక పడయ వీలా? పిల్లీ!

**90**

మార్జాల కబళ మనుచున్
బూర్జువ న్యాయమ్ము నొకటి పుట్టించి, నినున్
వర్జింత్రు! తోడి జీవుల
దర్జా కనలేరు నరులు త్రాష్టులు, పిల్లీ!

**91**

తుంటరి యెలుకల గొట్టుచు
పంటను రక్షించు నీవు పాలడిగినచో
కంట తడి పెట్టుకొందురు!
తుంటరు లీ నరులు చాల! తూ తూ, పిల్లీ!

92

నిదురల కదిలిన నరునికె
బెదరుచు తుఱ్ఱుమను నీవె, పీకెదవు కనుల్
గది బెట్టి కొట్టినప్పుడు!
బ్రదుకు రహస్యమున కీవ బ్రహ్మవు! పిల్లీ!

93

పిట్టా పిట్టా పోరును
చిట్ట చివరి కెవరు తీరిచిరి? నువు కాదే?
గుట్టింత తెలిసి నప్పుడె
పుట్టువు సార్థక్యమొందు పుడమిన్; పిల్లీ!

94

పిల్లి మరి గుడ్డి దయితే
పిల్లెలుకయు గేలిసేయు పృథ్విని; నరులం
దెల్లెడ నే డిదె సత్యము!
బల్లెము లేకున్న వాడు బానిసె! పిల్లీ!

95

ఏదో ఒక స్వార్థము లే
కే దొరలును చెలిమిచేయ రెవ్వరితోనున్;
మీదెరిగి, కాలు గాలిన
మాదిరి తిరుగుటలు మాను మమ్మా! పిల్లీ!

96

ధనికుని పిల్లియు, మరి పి
ల్లిని కుక్కయు దోచు నంద్రు లేకి జనమ్ముల్;
ధనికుని, పిల్లిని, కుక్కను
ధనదాహుడు దోచు నమ్మ! ధరలో, పిల్లీ!

97

చేపల గంపకు పిల్లిని
కాపుంచిన యట్టు లనుచు కడు బల్కుచు, దా
సాపడుదురు దేవుని ని
క్షేపములను కూడ నరులు చెనటులు! పిల్లీ!

98

పిల్లి కనులు పో గోరును,
పిల్లల సిరి గోరు కుక్క పృథ్వి ననుచుపెన్
కల్ల బలి సామెతల నీ
యుల్లము నొప్పింత్రు! పచ్చ నోర్వరు! పిల్లీ!

99

భళిరే, పిల్లికి సాక్ష్యం
బెలుకా? అని గేలి సేయు పెద్దలె తామున్
నిలుపుకొనుచుంద్రు అనుచర
బలము పయిన్ నిల్పి కీర్తి పదువులు, పిల్లీ!

**100**

మొగమాటము పోవిడి, గ్రో
లగ వలయును జీవి సుఖము లన్నియు; వెనుకన్
వగచిన ఫల మేమిటి? త్రా
వగ జాలని పిల్లి రీతి వ్యర్థము! పిల్లీ!

**101**

ఈ లోకములో కొందరు
గ్రోల లేక ఒలుకబోసుకొని, దానిని మా
ర్జాలగుణ మంద్రు! నీ గుణ
జాలము మా నరుల కింద్రజాలమె! పిల్లీ!

**102**

సన్నని జాడీ లోపలి
వెన్నెనను ఒలకకుండ పెలికిన్ గొను బల్
విన్నాణి వీవు! నీ కర
మెన్న సుధాకరమె యౌను ఇలలో, పిల్లీ!

**103**

మాను పిల్లో, మన్ను పిల్లో
కానంబడు నెలుక బట్టగల్గిన యపుడే;
మానవుడు నడుమ దూరబడి
ప్రాణికి లేకుండ జేసె ప్రగతిన్! పిల్లీ!

**104**

ఆకటికి మించి చంపుట
లో కద బాంధవులు మనుజులును, పులులును? ఈ
మూకలకె మామవా? కా
మాకులతల కెల్ల చందమామవె! పిల్లీ!

**105**

ఎలుకయు పిల్లియు నొకటై
నిలిచినచో రైతు కొంప నీరై పోదా?
మెలకువ నీ కిటు కెరిగిన
తెలివియె పాలించు జగము! తెలియవె! పిల్లీ!

**106**

పిల్లి బజారుకు పోయిన
ఇల్లు తీసి పందిరివేయు నెలుకలు; మరి మా
ముల్లోచను డెటు పోయెనొ!
కల్లోలము చేతు రవని కపటులు! పిల్లీ!

**107**

ఘనులైన వారి దెల్పగ
చన వుండిన వారికేని సాధ్యం బౌనే?
కన నెందును పిల్లికి గం
టను కట్టిన మగలు కలర టమ్మా? పిల్లీ!

## 108

పరమేశ్వరు డొక్కడు, అం
దరి హృదయము లందు కల డతం డనుచునె, కొం
దరి నదయత బీడించెడు
నరుడే రుద్రాక్ష పిల్లి! నమ్మకె, పిల్లీ!

## 109

పంజరము లోని చిలుకను
రంజనముగ పల్కరించి రమ్మందువు; ఆ
పంజరము పోవ, అది నీ
గంజిన్ ఉప్పుగ ల్లగును కాదే? పిల్లీ!

## 110

పంజరము కల్గు నపుడే
పెంజీకటి నైన చిల్క పెంపొందును; ఆ
పంజరము జారి పోయిన
అంజనమున కైన గాని అందదు; పిల్లీ!

## 111

కడు పెంతయున్న, ఎటు కుం
చెడు పట్టును పోలలోన? నిజశక్తి నెరుం
గడు జీవుడు, ఎటు సుఖపడు?
అడియాసలు దుఃఖ పెట్టు నమ్మా? పిల్లీ!

## 112

మాలిన్యములకు కాయమె
ఆలయ మని తెలిసి నీవు అన్ని మలములన్
నేలన్ పూడ్తువు; మనిషికి
మాలిన్యపు కొంప అతని మనసే! పిల్లీ!

## 113

మా పక్కయింటి దంపతు
లే పొద్దును కీచులాడ్డ రేలో! ఏనా
డే పిల్లియు కుక్కయు నే
లోపమ్మన నట్లు పుట్టిరో కద! పిల్లీ!

## 114

పెళ్ళి యను పేర నోటికి
కళ్ళెము తగిలించి, పురుషకారము చంపే
ముళ్ళపొద నరుని పద్ధతి!
పెళ్ళాడిన వాడు దొంగ పిల్లే! పిల్లీ!

## 115

పిల్లికి చెలగాటము వలె
పెళ్ళానికి వేడ్క మగని పీడించుట! ఈ
పెళ్ళిళ్ళ తంతు లందుకె!
త ల్లగుటకు పెళ్ళెయేల? తలపవె! పిల్లీ!

## 116

కల్లా కపటము తెలియక,
ఇల్లిల్లున్ దిరుగు, చింట నింటన్ గల గు
ట్టెల్లన్ తెలిసే నీవే
పల్లెత్తిన, నేమి మిగులు బండలు? పిల్లీ!

## 117

మంచి ధర కల్గి యుండియు,
అంచితముగ లక్ష్మి సొంత యాలే యయ్యున్,
చెంచెతను కోరడే హరి?
చంచలమే పురుష మనసు! జగతిన్, పిల్లీ!

## 118

నేతయగు రామ చంద్రుడె
సీతను వర్జించి స్వర్ణ సీతను గొనియెన్!
భూతలిని నెంత వారును
నాతిని భరియించ లేరు, నమ్ముము! పిల్లీ!

## 119

సామాన్య వనిత యెపుడున్
ప్రేమించగ రాదు కవిని, ప్రేమించినచో
సామాన్య పరిధి దాటక
ఏ మాత్రము సుఖము కలుగ దిలలో, పిల్లీ!

120

తన మగడు కళా స్రష్టయొ,
ధననాథుడొ, ఋషియొ, లోకదైవమొ-తేడా
కన జాలదు స్త్రీ యెన్నడు;
తన దేహమె తనకు సుఖము! ధరలో, పిల్లీ!

121

స్థావర జంగమ వర్గము
లేవియు తప్పులను చేయ, వెరుగని కతనన్;
భావము గల మనుజునకే
యావద్గుణ దోష బాధ లమ్మా! పిల్లీ!

122

నడిరేయి దాక క్లబ్బుల
బడి తిరుగుచు, విసిగి భార్య పండుకొనగ, పి
ల్లడుగులతో దొడ్డి వాకిట
తడబడు భర్తలకు నీవె దైవము! పిల్లీ!

123

ఒక నూరు కంద పద్యము
లకు వస్తువు కలదె నీ కులమ్మున నని ఇం
చుక జంకితి, ఎందును కో
టికి పడగెత్తంగ వచ్చు లీవిగ, పిల్లీ!

## 124

పిల్లిని చంకను బెట్టుక
వెళ్ళుట యను పిచ్చినుడులు, విశ్వాసములున్
చెల్ల విక; నిన్ను గైకొని
ఢిల్లీ వర కేగ వచ్చు, తెలియవె? పిల్లీ!

## 125

చాలింతు నింక, కోతల
కాలము గద, తీరుబాటు కలుగదు నీకున్;
పాలున్నవి, రేలున్నవి,
చేలున్నవి, పోయి రమ్ము శ్రీతో, పిల్లీ!

## 126

పిల్లలు, పిచికలు గల ప్రతి
యిల్లును నీ దగుత! లోక మెల్లెడలను నీ
చెల్లుబడి వెల్లి విరియుత!
చల్లగ నీ రాజ్య మెపుడు సాగుత! పిల్లీ!